## హాకీలో భారత పతకాలు

| 1928 | 1932 | 1936 | 1948 | 1952 | 1956 | 1960 | 1964 | 1968 | 1972 | 1980 | 2020 | 2024 |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| (అమెస్టర్‌డామ్) | (లాస్ ఏంజిల్స్) | (బెర్లిన్) | (లండన్) | (హెల్సెంకి) | (మెల్‌బోర్న్) | (రోమ్) | (టోక్యో) | (మెక్సికో) | (మ్యూనిచ్) | (మాస్కో) | (టోక్యో) | (పారిస్) |
| స్వర్ణం | స్వర్ణం | స్వర్ణం | స్వర్ణం | స్వర్ణం | స్వర్ణం | రజతం | స్వర్ణం | కాంస్యం | కాంస్యం | స్వర్ణం | కాంస్యం | కాంస్యం |

**భారత హాకీ జట్టు అద్భుతం చేసింది! పారిస్ ఒలింపిక్స్‌లో మువ్వన్నెల పతాకాన్ని రెపరెపలాడించింది. పునర్వైభవానికి టోక్యో ఒలింపిక్స్‌లో బీజం పడగా..పారిస్ విశ్వక్రీడల్లో తమ సత్తాఏంటో చేతల్లో చూపెట్టింది. సెమీస్‌లో జర్మనీ చేతిలో పోరాడి ఓడిన టీమ్‌ఇండియా.. స్పెయిన్‌తో కాంస్య పతక పోరులో బెబ్బులిలా గర్జించింది. గాయపడ్డ సింహాన్ని తలపిస్తూ స్పెయిన్‌పై పంజా విసిరింది. హర్మన్‌ప్రీత్‌సింగ్ డబుల్ ధమాకాతో మరోమారు నాయకునిలా ముందుండి నడిపిస్తే.. పెట్టని కోటగోడలా శ్రీజేశ్ ప్రత్యర్థికి సింహస్వప్నంలా నిలిచాడు. ఆఖరి సెకన్ వరకు ఉత్కంఠ రేపిన మ్యాచ్‌లో భారత్ కాంస్య కాంతులు విరజిమ్మింది. 52 ఏండ్ల సుదీర్ఘ విరామం తర్వాత వరుసగా రెండు ఒలింపిక్స్‌లో పతకాలతో కొత్త చరిత్రకు నాంది పలికింది. అసమాన ప్రతిభతో దేశానికి ఎన్నో చిరస్మరణీయాలు అందించడంలో కీలకమైన శ్రీజేశ్ డబుల్ ఒలింపియన్‌గా కెరీర్‌కు వెలుగు జిలుగులు అద్దుకున్నాడు. మొత్తంగా పడుతూలేస్తూ సాగుతున్న భారత ఒలింపిక్ ప్రయాణంలో హాకీలో కాంస్య పతకం కొత్త ఊపిరి ఊదింది. కోట్లాది భారతీయ అభిమానుల గుండెలు ఉప్పొంగేలా చేసిన హాకీ వీరులు ప్రశంసల జడివానలో తడిసిముద్దవుతున్నారు. ప్రధాని మొదలు సామాన్యుల వరకు హాకీ విజయాన్ని తనివితీరా ఆస్వాదిస్తున్నారు.**

### హాకీ కాంస్య కాంతులు

# చక్ దే ఇండియా

స్పెయిన్‌పై చిరస్మరణీయ విజయం • 52 ఏండ్ల తర్వాత వరుస ఒలింపిక్స్‌లో పతకాలు • సుదీర్ఘ కెరీర్‌కు గోల్ కీపర్ శ్రీజేశ్ వీడ్కోలు




పారిస్: ఒలింపిక్స్ హాకీలో భారత్‌ది ఘనమైన చారిత్రక వారసత్వం. హాకీ అంటే భారత్..భారత్ అంటే హాకీ అనే రీతిలో ఆటను శాసించిన తీరు గత చరిత్ర చూస్తే ఇట్టే అర్థమవుతుంది. 1928 అమెస్టర్‌డామ్ ఒలింపిక్స్ నుంచి మొదలుపెడితే నేటి పారిస్ విశ్వక్రీడల వరకు భారత హాకీ రికార్డులను టచ్ చేసిన వాళ్లు లేరు. ఈ ఘనమైన చరిత్రలో భారత్ ఏకంగా 8 స్వర్ణాలు, ఒక రజతం, 4 కాంస్య పతకాలతో ఎవరెస్ట్ అంత ఎత్తులో ఉన్నది. 1968(మెక్సికో), 1972(మ్యూనిచ్) ఒలింపిక్స్ తర్వాత 52 ఏండ్లకు వరుసగా టోక్యో(2020), పారిస్(2024) విశ్వక్రీడల్లో టీమ్‌ఇండియా పతకాలు కొల్లగొట్టి నయా చరిత్ర లిఖించింది. మ్యాచ్ విషయానికొస్తే గురువారం జరిగిన కాంస్య పతక పోరులో భారత్ 2-1 తేడాతో స్పెయిన్‌పై చిరస్మరణీయ విజయం సాధించింది. భారత్ తరఫున హర్మన్‌ప్రీత్(30ని, 33ని) డబుల్ గోల్స్‌తో అదరగొట్టగా, కెప్టెన్ మార్క్ మిరాలెస్(18ని) స్పెయిన్‌కు ఏకైక గోల్ అందించాడు.

**హర్మన్ డబుల్ ధమాకా:**

స్పెయిన్‌తో కాంస్య పతక పోరులో భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌సింగ్ తన దమ్ము ఏంటో చూపెట్టాడు. మెగాటోర్నీలో సూపర్ ఫామ్‌మీదున్న హర్మన్‌ప్రీత్ స్పెయిన్‌తో కీలక పోరులోనూ అదే జోరు కనబరిచాడు. సెమీస్‌లో జర్మనీ చేతిలో ఓటమి నుంచి తొందరగానే తేరుకున్న టీమ్‌ఇండియా..స్పెయిన్‌కు ఎట్టి పరిస్థితుల్లో మ్యాచ్ చేజార్చుకోవద్దనే పట్టుదలతో బరిలోకి దిగింది. దీనికి తోడు గోల్‌కీపర్ శ్రీజేశ్ సుదీర్ఘ కెరీర్‌కు ఘనమైన వీడ్కోలు పలికేందుకు సహచర ప్లేయర్లందరూ గట్టిగా ప్రయత్నించారు. తొలి క్వార్టర్‌లో కొంత మందకొడిగానే కదిలిన భారత దళాలు..రెండో క్వార్టర్‌లో తమ ఆటతీరుకు పదును పెట్టారు. అయితే 18వ నిమిషంలో డీసర్కిల్‌లో మన్‌ప్రీత్‌సింగ్ చేసిన తప్పుతో దక్కిన పెనాల్టీ స్ట్రోక్‌ను మిరాలెస్ గోల్‌గా మలువడంతో స్పెయిన్ 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. ఇక్కణ్నుంచి తమ గేర్ మార్చిన టీమ్‌ఇండియా..స్పెయిన్ గోల్‌పోస్ట్‌లకు దాడులకు దిగింది. రెండో క్వార్టర్స్ ముగుస్తుందన్న తరుణంలో దక్కిన పెనాల్టీ కార్నర్‌ను హర్మన్‌ప్రీత్‌సింగ్ గోల్ చేయడంతో స్కోరు 1-1తో సమమైంది. మూడో క్వార్టర్ మొదలైన మూడో నిమిషంలో వచ్చిన పెనాల్టీ కార్నర్‌ను సద్వినియోగం చేసుకోంటూ హర్మన్ గోల్‌గా మలువడంతో భారత్ ఆధిక్యం 2-1కు చేరుకుంది. ఓవైపు తమ ఆధిక్యాన్ని కాపాడుకుంటూనే మరోవైపు స్పెయిన్ ఫార్వర్డ్ దాడులను భారత్ దీటుగా తిప్పికొట్టింది. కీలకమైన నాలుగో క్వార్టర్‌లో దూకుడు పెంచిన స్పెయిన్..గోల్ లక్ష్యంగా భారత్‌పై దాడులు ముమ్మరం చేసింది. గోల్ కోసం బంతిని అందుకుని వేగంగా వెళుతున్న క్రమంలో స్పెయిన్ ప్లేయర్ అడ్డుతగలడంతో హార్దిక్‌సింగ్ భుజానికి గాయమైంది. అయితే కొద్ది విరామం తర్వాత తిరిగి అతను మైదానంలోకి వచ్చాడు.

**ఆఖర్లో హోరాహోరీ:**

భారత్, స్పెయిన్ మ్యాచ్‌లో ఆఖరి క్షణాలు నరాలు తెగే ఉత్కంఠ మధ్య సాగాయి. చివర్లో ఒత్తిడికి గురై ప్రత్యర్థికి గోల్స్ సమర్పించుకునే లక్షణమున్న భారత్ ఈసారి ఆ తప్పును పునరావృతం చేయలేదు. మ్యాచ్ మరో 40 సెకన్లలో అయిపోతుందన్న తరుణంలో హర్మన్‌ప్రీత్‌సింగ్ ఫౌల్‌తో దక్కిన వరుస పెనాల్టీ కార్నర్లను స్పెయిన్ వినియోగించుకోలేకపోయింది. ఓవైపు బలమైన రక్షణ శ్రేణికి తోడు గోల్‌కీపర్ శ్రీజేష్ అడ్డుగోడలా నిలువడంతో భారత్‌కు చిరస్మరణీయ విజయం ఖరారైంది. మ్యాచ్ ముగిసిన తర్వాత శ్రీజేశ్ బొక్కాబోర్లా పడుకుని గోల్‌పోస్ట్‌కు దండం పెట్టాడు. మరోవైపు సహచరుల అంతా శ్రీజేష్‌కు గార్డ్ ఆఫ్ హానర్ తరహాలో సెల్యూట్ చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఇక తన ట్రేడ్‌మార్క్ స్టయిల్‌లో శ్రీజేష్ గోల్‌పోస్ట్‌పై ఎక్కి అభిమానులకు అభివాదం చేయడం కనులవిందు చేసింది.

**ఒక ఒలింపిక్స్‌లో అత్యధిక గోల్స్**

| | | |
|---|---|---|
| సురేందర్‌సింగ్ | 14 గోల్స్ | మాస్కో 1980 |
| హర్మన్‌ప్రీత్‌సింగ్ | 10 గోల్స్ | పారిస్ 2024 |

| గోల్ కీపర్‌గా శ్రీజేష్ ప్రదర్శన | | |
|---|---|---|
| | ఎదుర్కొన్న షాట్స్ | 62 |
| | సేవ్ చేసిన షాట్స్ | 50 |

### హాకీ జట్టుకు నజరానా

పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకంతో మెరిసిన భారత హాకీ జట్టుకు హాకీ ఇండియా(హెచ్‌ఐ) నజరానా ప్రకటించింది. గురువారం స్పెయిన్‌తో జరిగిన కాంస్య పతక పోరులో భారత్ చిరస్మరణీయ విజయం సాధించిన నేపథ్యంలో హెచ్‌ఐ ఈ నిర్ణయం తీసుకుంది. వరుసగా రెండో విశ్వక్రీడల్లో పతకాన్ని అందించిన ప్లేయర్లు ఒక్కొక్కరికి రూ.15లక్షలు, సహాయక బృందంలో ఒక్కొక్కరికి రూ.7.5 లక్షల చొప్పున నగదు ప్రోత్సాహం ప్రకటించింది. ఈ విషయాన్ని హెచ్‌ఐ తమ అధికారిక ఎక్స్ ద్వారా వెల్లడించింది.

### శ్రీజేష్ అల్విదా..

పరట్టు రవీంద్రన్ శ్రీజేష్..క్లుప్తంగా పీఆర్ శ్రీజేష్. భారత హాకీకి పెట్టని కోట గోడగా పేరొందిన శ్రీజేష్ తన 18 ఏండ్ల సుదీర్ఘ కెరీర్‌కు చిరస్మరణీయ విజయంతో వీడ్కోలు పలికాడు. స్పెయిన్‌తో జరిగిన కాంస్య పతక పోరులో చిరస్మరణీయ విజయం ద్వారా భారత్‌కు ఆఖరి ఆట ఆడేశాడు. 2006లో జాతీయ జట్టు తరపున అరంగేట్రం చేసిన శ్రీజేష్ 328 మ్యాచ్‌ల్లో ప్రాతినిధ్యం వహించాడు. ఇన్నేండ్ల సుదీర్ఘ ప్రయాణంలో భారత చారిత్రక విజయాల్లో శ్రీజేష్‌ది కీలక పాత్ర. ప్రత్యర్థి జట్ల ప్లేయర్ల దాడులను కాచుకు కూర్చుంటూ గోల్‌పోస్ట్ ముందు గోడలా గోల్స్ అడ్డుకోవడంలో అతనికి అతడే సాటిగా నిలిచాడు. నాలుగు దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ టోక్యోలో భారత్ కాంస్యం గెలువడంలో అతను అన్నీతానై వ్యవహరించాడు. కీలకమైన సమయాల్లో సహచరుల్లో స్ఫూర్తిని నింపుతూ ప్రత్యర్థులకు సవాళ్లు విసరడంలోఅతని తర్వాతే ఎవరైనా. కోచింగ్ కోసం పెంచుకున్న ఆవును అమ్మిన అమ్మ..శ్రీజేష్ కెరీర్‌ను అద్భుతంగా తీర్చిదిద్దింది. 1988, మే 8న కొచ్చిలో రవీంద్రన్, ఉష దంపతులకు జన్మించిన శ్రీజేష్ అంచలంచెలుగా ఎదిగాడు. 2004లో భారత అండర్-21 జట్టుకు ఎంపికైన అతను ఆ తర్వాత రెండేండ్ల వ్యవధిలో జాతీయ జట్టులోకి దూసుకొచ్చాడు. ఇక అక్కణ్నుంచి వెనుదిరిగి చూసుకోని శ్రీజేష్ ప్రపంచంలోనే అత్యుత్తమ గోల్‌కీపర్‌గా మన్ననలు పొందాడు.




**పతకాల పట్టిక**


| | దే | స్వ | ర | కా | మొ |
|---|---|---|---|---|---|
| 1 | చైనా | 28 | 25 | 19 | 72 |
| 2 | యూఎస్‌ఏ | 27 | 36 | 34 | 97 |
| 3 | ఆస్ట్రేలియా | 18 | 14 | 11 | 43 |
| 4 | ఫ్రాన్స్ | 14 | 18 | 21 | 53 |
| 5 | బ్రిటన్ | 13 | 17 | 21 | 51 |
| 6 | కొరియా | 12 | 8 | 7 | 27 |
| 72 | భారత్ | 0 | 0 | 4 | 4 |

దే: దేశం, స్వ: స్వర్ణం, ర: రజతం, కా: కాంస్యం మొ: మొత్తం

## కాంస్య పోరుకు అమన్

**సెమీస్‌లో ఓటమి**

**ప్రిక్వార్టర్స్‌లోనే అన్షు మాలిక్ నిష్క్రమణ**



పారిస్: రెజ్లింగ్‌లో స్వర్ణం లేదా రజతం మీద ఆశలు రేపిన యువ రెజ్లర్ అమన్ సెహ్రావత్ పోరాటం సెమీస్‌లోనే ముగిసింది. ప్రిక్వార్టర్స్, క్వార్టర్స్‌లో 'టెక్నికల్ సుపీరియారిటీ'తో గెలుపొందిన అమన్.. సెమీఫైనల్స్‌లో మాత్రం ఆ స్థాయి ప్రదర్శన చేయలేక చతికిలపడ్డాడు. పురుషుల 57 కిలోల ఫ్రీస్టయిల్ విభాగం సెమీస్‌లో అమన్ 0-10తో హిగూచి (జపాన్) చేతిలో పరాభవం పాలయ్యాడు. 2 నిమిషాల 14 సెకన్లలోనే ముగిసిన సెమీస్ పోరులో హిగూచి ఆరంభం నుంచే దూకుడుగా ఆడాడు. బౌట్ మొదలైన నిమిషంలోనే అమన్‌ను కింద పడేసి మూడు పాయింట్లు దక్కించుకున్నాడు. ఆ తర్వాత మరో రెండుసార్లు అలాగే చేసి అమన్‌కు పుంజుకునే అవకాశం ఇవ్వకుండా ఫైనల్ చేరాడు. ఈ ఓటమితో అమన్ శుక్రవారం క్రుజ్ డెరియన్ (పోర్టొరికో)తో జరుగబోయే కాంస్య పోరులో తలపడనున్నాడు. అంతకుముందు ప్రిక్వార్టర్స్‌లో 10-0తో వ్లాదిమిర్ ఎగోరోవ్ (నార్త్ మకెడొనియన్)ను ఓడించిన అమన్.. క్వార్టర్స్‌లో 12-0తో అబాకరోవ్ (అల్బేనియా)ను చిత్తుచేసి సెమీస్ చేరాడు. కాగా మహిళల 57 కిలోల ప్రిక్వార్టర్స్‌లో అన్షు మాలిక్ 2-7తో లూయిస్ మారోయిలిస్ (అమెరికా) చేతిలో ఓడి తొలి రౌండ్‌లోనే వెనుదిరిగింది.



# వినేశ్ వీడ్కోలు

**రిటైర్మెంట్ ప్రకటించిన స్టార్ రెజ్లర్.. 'కుస్తీ గెలిచింది నేను ఓడిపోయాను' అంటూ ట్వీట్**

పారిస్: భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగాట్ అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికింది. ఒలింపిక్ పతకం గెలవాలన్న తన కల నెరవేరకుండానే ఆమె ఆటపై 'పట్టు' సడలించింది. పారిస్‌లో సెమీ ఫైనల్స్ గెలిచి ఫైనల్స్‌కు అర్హత సాధించినా తుది పోరుకు కొద్దిగంటల ముందు వంద గ్రాములు అదనపు బరువుతో 'అనర్హత' వేటు ఎదుర్కొన్న ఆమె గురువారం 'ఎక్స్' వేదికగా తన తల్లిని ఉద్దేశిస్తూ.. 'అమ్మా, కుస్తీ నా మీద గెలిచింది. నేను ఓడిపోయాను. నన్ను క్షమించు. నీ ఆశలు, నా ధైర్యం అన్ని విచ్ఛిన్నమయ్యాయి. ఇక నాకు పోరాడే బలం లేదు. 2001 నుంచి 2024 దాకా సాగిన నా రెజ్లింగ్ ప్రయాణానికి వీడ్కోలు. మీ అందరికీ రుణపడి ఉంటాను. నన్ను క్షమించండి' అని రాసుకొచ్చింది. ఐవోసీ విధించిన అనర్హత వేటుకు సంబంధించిన విచారణ కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ (సీఏఎస్) వద్ద విచారణకు ఉండగానే వినేశ్ తీసుకున్న ఈ నిర్ణయంతో దేశ క్రీడాభిమానులు మరోసారి నివ్వెరపోయారు. తొందరపడి నిర్ణయాలు తీసుకోవద్దని ఆమెకు సూచించారు. ఫోగాట్ పెద్దనాన్న మహావీర్ ఫోగాట్, భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు సంజయ్ సింగ్ ఆమె నిర్ణయాన్ని పున:సమీక్షించుకోవాలని కోరారు.

**వినేశ్ ప్రొఫైల్**

| | | |
|---|---|---|
| పేరు: | వినేశ్ ఫోగాట్ | |
| పుట్టిన తేదీ | (25-08-1994) | |
| **కామన్వెల్త్** | | |
| 2014 (గ్లాస్గో)లో | | స్వర్ణం |
| 2018 (గోల్డ్ కోస్ట్)లో | | స్వర్ణం |
| 2022 (బర్మింగ్‌హామ్)లో | | స్వర్ణం |
| **ఆసియాగేమ్స్** | | |
| 2014(ఇంచియాన్) | | కాంస్యం |
| 2018(జకార్తా) | | స్వర్ణం |
| **వరల్డ్ చాంపియన్స్** | | |
| 2019లో | | కాంస్యం |
| 2022లో | | కాంస్యం |

### నేడు కేసు విచారణ

ఐవోసీ విధించిన 'అనర్హత' వేటుపై అంతర్జాతీయ క్రీడా న్యాయ స్థానం(సీఏఎస్)ను ఆశ్రయించిన వినేశ్ ఫోగాట్‌కు భారీ ఊరట దక్కింది. ఆమె అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న సీఏఎస్.. శుక్రవారం విచారణ జరుపనుంది. వినేశ్ తరఫున నలుగురు న్యాయవాదులతో కూడిన బృందం వాదనలు వినిపించనుంది. వారిలో ప్రముఖ న్యాయవాది హరీష్ సాల్వే, విధుష్పత్ సింఘానియా కూడా ఉన్నారు. గురువారం మధ్యాహ్నం విచారణకు రానున్న ఈ కేసులో ఇదే రోజు తీర్పు వెలువడే అవకాశాలు మెండుగా ఉన్నాయి.


### జ్యోతికి రెపిచేజ్‌లోనూనిరాశే

విశ్వక్రీడల్లో సత్తా చాటేందుకు 'రెపిచేజ్' రూపంలో మరో అవకాశం వచ్చినా తెలుగమ్మాయి జ్యోతి యర్రాజీకి మళ్లీ నిరాశ తప్పలేదు. 100 మీటర్ల హర్డిల్స్ 'రెపిచేజ్ రౌండ్'లో జ్యోతి నాలుగో స్థానంలో సెమీఫైనల్స్‌కు అర్హత సాధించే అవకాశాన్ని కోల్పోయిది. రేసును 13.17 సెకన్లలో పూర్తిచేసిన ఆమె ఓవరాల్‌గా 16వ స్థానంతో ముగించింది.

## అంతిమ్‌పై మూడేండ్ల నిషేధం?

**క్రమశిక్షణ ఉల్లంఘన చర్యలకు పాల్పడినట్టు ఆరోపణ**

**భారత్‌కు రాగానే నిర్ణయం ప్రకటించనున్న ఐవోఏ!**



పారిస్: భారత యువ రెజ్లర్ అంతిమ్ పంగల్ అంతర్జాతీయ కెరీర్‌లో మూడేండ్ల నిషేధం ఎదుర్కోనున్నట్టు తెలుస్తోంది. పారిస్ ఒలింపిక్స్‌లో ఆమె క్రమశిక్షణ రాహిత్యానికి పాల్పడటమే ఇందుకు కారణం. బుధవారం ప్రిక్వార్టర్స్‌లో ఓడిన తర్వాత అంతిమ్ 'ఒలింపిక్ గ్రామం'లోకి తన సోదరిని పంపించడం వివాదాస్పదమైంది. అక్కడ ఉన్న తన వస్తువులను తీసుకొచ్చేందుకు గాను అంతిమ్ తన అక్రిడిటేషన్ కార్డును సోదరికి ఇచ్చి పంపించడంతో పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. అక్రిడిటేషన్ కార్డును దుర్వినియోగం చేయడం క్రమశిక్షణ ఉల్లంఘన చర్యల కిందికే వస్తుందని, అంతిమ్ భారత్‌కు తిరిగి రాగానే భారత ఒలింపిక్ సంఘం(ఐవోఏ) ఆమెపై నిషేధానికి సంబంధించిన ప్రకటన చేసే అవకాశమున్నట్టు తెలుస్తోంది. ఈ విషయమై అంతిమ్ స్పందిస్తూ.. 'నన్ను గానీ, నా సోదరిని గానీ పోలీసులు అరెస్టు చేయలేదు. అక్రిడిటేన్ కార్డు వివరాలు ఆరా తీసి మాత్రమే పంపించారు. నా కోచ్ కూడా కారులో మద్యం తాగి పోలీసులకు దొరికాడని వార్తలు వస్తున్నాయి. అవన్నీ అవాస్తవం. క్యాబ్ డ్రైవర్‌తో చార్జీలకు సంబంధించిన వాగ్వాదం తప్ప వాళ్లు గొడవ పడలేదు' అని స్పష్టతనిచ్చింది. ఇదిలా ఉండగా అంతిమ్‌పై నిషేధం పుకార్లేనని ఐవోఏ కొట్టిపారేయడం గమనార్హం.

